సాక్షి ప్రకాశం

శుక్రవారం । 26 । జనవరి । 2024



కార్యకర్తలకు అండగా ఉంటా..

కార్యకర్తలకు అండగా ఉంటానని, వారికి కష్టం కలగకుండా చూసుకుంటానని మంత్రి మేరుగు హామీ ఇచ్చారు. మద్దిపాడు మండలంలో మంత్రి పర్యటించారు. - IIలో..



నడికుడి రైల్వే లైన్ స్థల పరిశీలన

నడికుడి- కాళహస్తి రైల్వే లైన్‌కు సంబంధించి పామూరు మండలంలో భూముల కోసం గురువారం అధికారులు పరిశీలించారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం 32/23

వాతావరణం

ఉదయం వేళ పొగమంచు ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఓటరు నమోదులో ప్రతిభకు సత్కారం



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ సీతారామయ్య, బీఎల్వో ఆరిఫా

గిద్దలూరు రూరల్/చీమకుర్తి: ఓటర్ల వివరాల నమోదులో ఉత్తమ ప్రతిభ చూపిన ఏఈఆర్‌ఓ, గిద్దలూరు తహసీల్దార్ డి.సీతారామయ్య, మద్దిపాడు మండలం గార్లపాడు బీఎల్వో షేక్ ఆరిఫా గురువారం విజయవాడలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఫారం-6, 7 దరఖాస్తుతోపాటు స్వీప్ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించినందుకుగాను తహసీల్దార్‌కు అవార్డు దక్కింది. కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ సంజీవయ్య, బీఎల్‌ఓ సురేష్‌కుమార్‌రెడ్డికీ ఉత్తమ అవార్డులు దక్కాయి. ఆరిఫాను మద్దిపాడు డీటీ శ్రీనివాసరావు, ఇతర అధికారులు అభినందించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు నేడు

ఒంగోలు: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఒంగోలు నగర కన్వీనర్ కటారి శంకర్ పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనాకుమారి తదితరులు పాల్గొంటున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పొగాకు అనధికార విక్రయాలొద్దు



బ్యారన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం లక్ష్మణరావు

ఒంగోలు సెంట్రల్: పొగాకును అనధికారికంగా విక్రయించవద్దని రైతులకు టుబాకో బోర్డు రీజినల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు సూచించారు. గురువారం ఒంగోలు సమీపంలోని మంగమూరు గ్రామంలో పొగాకు బ్యారన్లను ఆయన సందర్శించారు. క్యూరింగ్ సమయంలో జాగ్రత్తలను తెలియజేశారు. పొగాకు మండెలను వారం పది రోజుల వ్యవధిలో తిరగేయడం ద్వారా నాణ్యత బాగుంటుందని చెప్పారు. మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, దళారులు ఎవరైనా గ్రామాల్లో పర్యటిస్తూ ఉంటే టంగుటూరు విజిలెన్స్ అధికారి టి.గౌతమ్ 9866017691కు లేదా తనకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు స్కిల్ హబ్‌లో శిక్షణ

ఒంగోలు సిటీ: నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఆలోచనా విధానంతో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.శ్రీను గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్లంబర్స్ కోర్సు(జనరల్)లో మూడు నెలల శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపైన విద్యార్హత కలిగి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా ఒంగోలులోని నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. వివరాలకు అనూష 96522 82636, అంకయ్య 9989767255ను సంప్రదించాలని సూచించారు.

ఏఎంసీ చైర్మన్‌గా షంషేర్ అలీబేగ్



షంషేర్ అలీబేగ్

మార్కాపురం: మండల కేంద్రం మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల చైర్మన్ మీర్జా షంషేర్ అలీబేగ్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. వైస్ చైర్మన్‌గా పానుగంటి వెంకట సుబ్బ మురళీ కృష్ణారావు, సభ్యులుగా సయ్యద్ మక్బుల్ బాషా, పిన్నిక లక్ష్మీ ప్రసాద్, ఇల్లూరి శారద, తూంపాటి అంజనేయులు, పేరూరి లక్ష్మీదేవి, షేక్ నూర్జహాన్, ఓర్సు పత్తెమ్మ, వేశపోగు రాజు, కోలా వసంత కుమారి, శ్రీరామ్ అక్కమ్మ, చక్క సత్యనారాయణ, ఊటుకూరి సురేష్, కర్నె రమాదేవీలను నియమించారు. ఈ సందర్భంగా షంషేర్ అలీబేగ్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏఎస్పీ, డీఆర్వో తదితరులు



ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా జడ్జి భారతి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఆర్వో శ్రీలత, ఇతర జిల్లా అధికారులు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ఓటు.. వదలొద్దు..

"ప్రజాస్వామ్యంలో ఓటు అమూల్యమైనది.. ప్రజావ్యతిరేక పాలకుల పాలిట సింహస్వప్నం.. ఓటు విలువ తెలుసుకో.. ప్రజాహితంగా సుపరిపాలన అందించే వారిని ఎన్నుకుందాం.. బంగారు భవిష్యత్‌కు బాటలు వేద్దాం.. ఓటు వదులుకోవద్దు" అంటూ జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల, డివిజన్ కేంద్రాల్లో ర్యాలీలు చేశారు. ఓటు హక్కు వినియోగంపై జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, నాటక, నృత్య ప్రదర్శనలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం
- జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, మానవహారాలు
- ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ, సాంస్కృతిక ప్రదర్శనలు
- ప్రకాశం భవన్‌లో ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు
- పాల్గొన్న జిల్లా జడ్జి భారతి, కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశంభవనంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి, కలెక్టర్ దినేష్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత డీఆర్‌ఆర్‌ఎం స్కూలు నుంచి కలెక్టరేట్ వరకు వివిధ పాఠశాలల, కళాశాల విద్యార్థులు, పలు విభాగాల ఉద్యోగులు, మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై ప్లకార్డులు ప్రదర్శించారు. స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తూ కలెక్టర్ భారీ బెలూన్ ఎగుర వేశారు. అనంతరం ఓటు ప్రాధాన్యం తెలిపేలా ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన నాలుగు ప్రత్యేక స్టాళ్లను వీక్షించారు. సెల్ఫీ పాయింట్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా జడ్జి భారతి ఫొటోలు తీసుకున్నారు. అనంతరం "ఈ ఏడాది ఓటు వేయడం లాంటి మరొకటి లేదు-నేను తప్పకుండా ఓటు వేస్తాను" అనే ఇతివృత్తంతో స్పందన హాలులో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి భారతి మాట్లాడుతూ.. మన పాలకులను ఓటు ద్వారా మనమే ఎన్నుకునే హక్కు రాజ్యాంగం మనకు కల్పించిందన్నారు. బుల్లెట్ కంటే బ్యాలెట్ అత్యంత శక్తివంతమైనదని అభివర్ణించారు. అందుకే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల గుణగణాలను తెలుసుకుని సమర్థులను ఎన్నుకోవాలని సూచించారు. హక్కుగా వచ్చిన ఓటును తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఏ పార్టీతో, ప్రభుత్వంతో సంబంధం లేకుండా పనిచేస్తున్న అత్యంత విశ్వసనీయ సంస్థగా ప్రపంచంలోనే భారత ఎన్నికల సంఘానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైందన్నారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్ల కోసం వారి ఇంటికే వెళ్లి అధికారులు ఓటు సేకరించేలా ప్రత్యేక అవకాశం ఈ ఎన్నికల్లో కల్పించిందన్నారు.



బెలూన్‌ను ఎగురవేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పట్టణ ప్రాంత ఓటర్లు మరింతగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఏఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఓటరు స్వేచ్ఛగా ఓటును వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను రెవెన్యూ శాఖతో కలిసి పోలీసు యంత్రాంగం చేస్తోందన్నారు. ఓటుకు ఉన్న ప్రాధాన్యం, వినియోగించుకోవాల్సిన అవసరంపై సీనియర్ సిటిజన్ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ చైర్మన్ ఎం.నాగేశ్వరరావు, తొలిసారి ఓటు వినియోగించుకుంటున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థి గౌతమ్, డిగ్రీ కాలేజీ విద్యార్థిని వెంకటేశ్వరి, ట్రాన్స్ జెండర్ ప్రియాంక, సీనియర్ రైతు నంజుండప్ప, మెప్మా పొదుపు సంఘం మహిళ ఝాన్సీలక్ష్మి తదితరులు వారి అభిప్రాయాలను వేదికపై పంచుకున్నారు.

- 18ఏళ్లు నిండిన వారంతా కుల, మత, లింగ, ప్రాంత భేదాలు లేకుండా ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యలను, ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో ప్రసంగాన్ని వీక్షించారు.
- ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి ప్రతిసారీ ఓటేస్తున్న సీనియర్ సిటిజన్లు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ డీడీ పి.హనుమంతరావు, సీఎస్‌ఆర్ శర్మ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ సీవీఎల్ సుబ్రహ్మణ్యం, రిటైర్డ్ తహసీల్దార్ సీహెచ్ రంగనాథం, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి నరసింహారావును సత్కరించారు.
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఉత్తమ పనితీరు చూపిన దర్శి ఈఆర్‌ఓ, ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి లోకేశ్వరరావు, మరో పది మంది బీఎల్‌ఓలను సన్మానించారు.
- ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఇతివృత్తంతో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలు సుజాత, రత్నకుమారి, అంకాళమ్మతోపాటు పాల్గొన్న అందరికీ బహుమతులు అందజేశారు.



సీనియర్ ఓటరుకు సన్మానం..



రంగవల్లులను తిలకిస్తున్న అధికారులు

ఓటు హక్కు వినియోగంపై నిర్వహించిన ర్యాలీలో డీఎస్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి, పీడీ ధనుంజయరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు ఆర్‌డీఓ విశ్వేశ్వరరావు, స్వీప్ కార్యక్రమం నోడల్ అధికారి రవి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి అర్చన, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏఎల్‌ఎస్ కోఆర్డినేటర్ సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దర్శి నియోజకవర్గం.. మా కుటుంబం



మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ



అభిమానులతో కలిసి భారీ మోటారు సైకిల్ ర్యాలీలో పాల్గొన్న శివప్రసాద్‌రెడ్డి

దర్శి: 'నా బిడ్డ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి దర్శి నియోజకవర్గం నుంచి వైఎస్సార్ తరుపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి నా బిడ్డను ఆశీర్వదించండి' అని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఎన్నికల ప్రచారం ప్రారంభోత్సవం సందర్భంగా రాజంపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆమె తన కుమారుడితో కలిసి ర్యాలీగా దర్శికి చేరుకున్నారు. దర్శిలోని గడియారం స్తంభం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈ సందర్భంగా భారీగా హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజలను ఉద్దేశించి వెంకాయమ్మ మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మన ఊరు-మన శివన్న కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే బూచేపల్లి కుటుంబం ముఖ్య ఉద్దేశమన్నారు. శివప్రసాద్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్.. రానున్న ఎన్నికల్లో తప్పకుండా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

- నా కుమారుడు శివప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించండి
- ప్రజలకు జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ విజ్ఞప్తి
- సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ పాలన
- తల్లితో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించిన దర్శి ఇన్‌చార్జి శివప్రసాద్ రెడ్డి
- హామీలిచ్చి అమలు చేయకపోవడమే చంద్రబాబు నైజమని ధ్వజం

వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, దివంగత సీఎం వైఎస్సార్ దైవ సమానులని పేర్కొన్నారు. తనకు కులాలు, మతాలు, వర్గాలు లేవని చెప్పారు. దర్శి నియోజకవర్గ ప్రజలంతా తమ కుటుంబమని ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పది మందికీ సాయం చేయడమే తన తండ్రి సుబ్బారెడ్డి నేర్పారని, అందుకే సీఎం జగనన్న వెంట నడుస్తున్నానన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మోసం చేయడమే బాబు నైజం

రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఎన్నికల ముందు హామీలిచ్చి గాలికొదిలేయడం చంద్రబాబు నైజమని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేసేందుకు కట్టగట్టుకుని వస్తున్న చంద్రబాబుకు సరైన బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు వెన్నపూస వెంకటరెడ్డి, తూము వెంకటసుబ్బారెడ్డి, సుబ్బయ్య, ఎంపీపీలు సుధాఅచ్చయ్య, బోరిగొర్ల ఉషామురళి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఎం బాషా, ఏఎంసీ మాజీ చైర్మన్ కేవీ రెడ్డి, సాగర్ ప్రాజెక్ట్ మాజీ వైస్ చైర్మన్ సద్ది పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీలు ఇత్తడి దేవదానం, గోళ్లపాటి మోషె, కోట రామిరెడ్డి, పోశం మధుసూధన్‌రెడ్డి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేద్దాం..
'మేరుగు'ను గెలిపిద్దాం





పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి మేరుగు నాగార్జున


- సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడాలి
- మాజీ మంత్రి, బాలినేని శ్రీనివాసరెడ్డి
- మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి పార్టీ శ్రేణులతో సమీక్ష

ఒంగోలు: రానున్న ఎన్నికల్లో సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడిలించాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి మేరుగు నాగార్జునను గెలిపించాలని దిశానిర్దేశం చేశారు. గురువారం ఒంగోలులోని తన నివాసంలో మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ శ్రేణులతో బాలినేని సమీక్షించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ.. 2024లో వైఎస్ జగన్‌ను మరోమారు సీఎంగా చేసుకోవాలంటే ప్రతి నియోజకవర్గంలోనూ విజయఢంకా మోగించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. సంతనూతలపాడు అభ్యర్థిగా డాక్టర్ మేరుగు నాగార్జునను సీఎం వైఎస్ జగన్ ప్రకటించిన దృష్ట్యా ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో మెజార్టీ వచ్చేలా కసరత్తు చేయాలన్నారు. మీకు ఏ అవసరం వచ్చినా తనతోపాటు మంత్రి మేరుగు నాగార్జున అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.

మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ.. వాసన్న అండతో సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధితోపాటు కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. సమన్వయ సమావేశం నిర్వహించి తన గెలుపుపై నియోజకవర్గంలోని నాయకులందరికీ దిశా నిర్దేశం చేయడం బాలినేని మంచితనానికి నిదర్శనమని కొనియాడారు. సమావేశంలో సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు దుంపా చెంచిరెడ్డి, మండువ అప్పారావు, బంగారు బాబు, నలమలుపు కృష్ణారెడ్డి, క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గోలి తిరుపతిరావు, బొల్లినేని కృష్ణయ్య, ఓబుల్‌రెడ్డి, ఇనగంటి పిచ్చిరెడ్డి, శ్రీమన్నారాయణతోపాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, గృహ సారథులు, పార్టీ నాయకులు పాల్గొని మేరుగు నాగార్జునకు సంఘీభావం ప్రకటించారు.

కొండపిలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే..

- నాలుగున్నరేళ్లలో ప్రజల ఖాతాల్లోకి రూ.2.50 లక్షల కోట్లు
- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి, కొండపి ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్



మాట్లాడూతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

టంగుటూరు: 'రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలు రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారు' అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదుమూలపు సురేష్ ఉద్ఘాటించారు. గురువారం టంగుటూరులోని బేసైడ్ కన్వెన్షన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా మంత్రి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న అన్ని వర్గాలకు సమానంగా సంక్షేమ పథకాలు అందించారని పేర్కొన్నారు. నాలుగున్నరేళ్లలో ప్రజల ఖాతాల్లోకి రూ.2.50 లక్షల కోట్లు జమ చేశారన్నారు. చరిత్ర తిరగరాయడానికి కొండపి నియోజవర్గం వేదిక కాబోతోందని, వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. కరోనా లాంటి కష్ట పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు కొనసాగించిన విషయాన్ని గుర్తు చేశారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు రుణమాఫీ చేస్తానని జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో రూ.25 వేల కోట్లు అందించి ఆదుకున్నారన్నారు.

జన్మభూమి కమిటీలతో మోసం

టీడీపీ పాలనలో పెత్తనం సాగించిన జన్మభూమి కమిటీలు అర్హులకు పథకాలు అందించకుండా మోసం చేశాయని మంత్రి ధ్వజమెత్తారు. టీడీపీ నేతలు జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారని మండిపడ్డారు. అందుకే టీడీపీ గత ఎన్నికల్లో 23 సీట్లకు పరిమితమైందన్నారు. ముందుగా బొమ్మల సెంటర్లోని అంబేడ్కర్, పూలే, బాబు జగ్జీవన్‌రామ్, వైఎస్సార్ విగ్రహాలకు మంత్రి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, రాష్ట్ర సర్పంచుల సంఘ అధ్యక్షుడు ఆనం సత్యనారాయణరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి మన్నం వెంకయ్య, వైఎస్సార్ టీఎఫ్ నేత సూదనగుంట వెంకటస్వామి, కొండపి ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, చిడిపోతు సుబ్బారావు, బీనీడి ఉదయకుమార్, మేదరమిట్ల భరత్‌రెడ్డి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ మల్లవరపు జయరామిరెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ఉప్పలపాటి నాగరాజు, పమిడి హరికృష్ణ, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన రెవెన్యూ రికార్డు భవనం ప్రారంభం



రెవెన్యూ రికార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రకాశం భవనం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రెవిన్యూ రికార్డు భవనాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. రూ.15లక్షల వ్యయంతో ఆరు నెలల్లో 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనం నిర్మించారు. దీంతో రికార్డుల నిర్వహణకు మార్గం సుగమం అయింది. రికార్డుల నిర్వహణపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రకాశం భవనం మొదటి అంతస్తులో సి, డి విభాగాలను ఏర్పాటు చేసేందుకు ఆధునికీకరించిన హాలును కూడా ప్రారంభించారు. ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఆర్‌ఓ శ్రీలత, ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ భాస్కర్‌బాబు, కలెక్టరేట్ ఏఓ చిరంజీవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



వెంకట్రాజుపాలెం పల్లెలో గ్రామస్తులు నాయకులతో మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తానని వారికి కష్టం కలగకుండా చూసుకుంటాననని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని దొడ్డవరప్పాడు వెంకట్రాజు పాలెం పల్లె, గుండ్లాపల్లి ఘడియపూడి, గార్లపాడు పునరావాస కాలనీల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పార్టీ అభిమానులను గురువారం సాయంత్రం కలిశారు. మండలంలో అన్ని గ్రామాల్లో పరిచయ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో తిరుగుతానన్నారు. ఆదేవిధంగా గ్రామ నాయకులను కలిసి గ్రామాల్లో సమస్యలను తెలుసుకుంటానన్నారు. పార్టీ పరంగా చేయాల్సిన పనులు చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటానని తెలిపారు. యువత మొత్తం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైపు చూస్తోందని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ముఖ్యమంత్రి పాటు పడుతుండటంతో ఆయనకు అండగా నిలవడానికి సిద్ధం ఉన్నారన్నారు. పేదలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోమారు ఆశీర్వదించి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. ముందుగా దొడ్డవరప్పాడు చేరుకున్న మంత్రి మేరుగు నాగార్జున అల్పాహారం ముగించుకుని, అక్కడ నుంచి వెంకట్రాజు పాలెం పల్లెకు చేరుకున్నారు. కాలనీ వాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం శ్రీరాముని ఆలయంలో పూజలు నిర్వహించారు. సమ్యలు ఏమైనా ఉన్నాయా అంటూ సర్పంచ్ బెజవాడ రాము, ఎంపీటీసీ సభ్యుడు బొమ్మల దేవదాసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గుండ్లాపల్లి వద్ద ఉన్న ఘడియపూడి, గార్లపాడు పునరావాస కాలనీలను సందర్శించారు. సంతనూతలపాడు నియజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న తనను సంతనూతలపాడు నియోజకవర్గంలో మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, ఓబుల రెడ్డి, సీనియర్ నాయకులు గుడ్డపాతల రవి, గట్టినేని అయ్యన్న, పోతినేని శ్రీనివాసరావు, బాబు, ఎంపీటీసీలు బొమ్మల దేవదాసు, పైనం ప్రభాకర్, పల్లకి పద్మకుమారి, సర్పంచ్‌లు బొమ్మల రామాంజనేయులు, గ్రామ నాయకులు చిరంజీవి, ఆశోకొరెడ్డి, యాకోబు, పలువురు గ్రామ నాయకులు పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

నిన్న టీడీపీలో.. నేడు వైఎస్సార్ సీపీలో

- ప్రలోభపెట్టారని టీడీపీపై వైఎస్సార్ సీపీ నాయకుల ఆరోపణ
- మంత్రి సురేష్ సమక్షంలో పార్టీలో చేరిక



సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

సింగరాయకొండ: మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు 30 కుటుంబాల వారిని టీడీపీ నాయకులు ప్రలోభ పెట్టి టీడీపీలో బుధవారం చేర్చుకున్నారు. ఎమ్మెల్యే స్వామి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో మసనం వెంకట్రావు ఆధ్వర్యంలో పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి సహకారంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన మద్దసాని కోటేశ్వరరావు, మాదాల శ్రీకాంత్, మేక హరికృష్ణ, ఎందేటి హరిబాబు, ఏందేటి వెంకట్రావును తిరిగి వైఎస్సార్ సీపీలోకి తీసుకునివచ్చారు. వీరికి టంగుటూరులో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గురువారం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి తిరిగివచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు మాట్లాడుతూ కొండపి ఎమ్మెల్యే స్వామి, టీడీపీ నాయకుడు దామచర్ల సత్య ప్రలోభ పెట్టి తమకు బలవంతంగా టీడీపీ కండువాలు కప్పి చేర్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని తమకు మసనం వెంకట్రావు తెలియజేయడంతో తప్పు తెలుసుకుని తిరిగి సొంత గూటికి వచ్చామని వివరించారు. కొండపిలో మంత్రి ఆదిమూలపు సురేష్, రాష్ట్రంలో జగనన్న గెలుపుకు తమవంతు సహకారం అందిస్తామని వాగ్దానం చేశారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, మాదాల శంకర్, బి. మురళి, మాదాల వేణు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన బదిలీపై వచ్చిన సీఐలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ రాజమోహన్



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ విజయ కృష్ణ

ఒంగోలు సబర్బన్: రానున్న సాధారణ ఎన్నికలను పురస్కరించుకొని సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన సీఐలు పలువురు ఎస్పీ మలికా గర్గ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా నుంచి ఒంగోలు రూరల్ సీఐగా బదిలీపై వచ్చిన ఏ.రాజమోహన్, గుంటూరు రేంజ్ నుంచి ఒంగోలు సీసీఎస్‌కు బదిలీపై వచ్చిన టి.విజయ కృష్ణ ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

- పోలీస్ అధికారులు, సిబ్బంది ఓటర్స్ డే ప్రతిజ్ఞ



జిల్లా పోలీస్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ మలికగర్గ్, పక్కన పోలీస్ అధికారులు

ఒంగోలు సబర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో పవిత్రమైనదని ఎస్పీ మలిక గర్గ్ అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, పోలీసులు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బందితో ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మట్లాడుతూ 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వెల్లడించారు. దేశంలో జనవరి 25వ తేదీకి ఓ ప్రత్యేకత ఉందన్నారు. 1950 జనవరి 25న ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని జాతీయ ఓటర్స్ డే అధికారికంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ఓటర్ల దినోత్సవ ప్రధాన లక్ష్యం ఓటర్లకు సాధికారిత, జాగరూకత, భద్రత కల్పిస్తూ సమాచారాన్ని అందించటం అన్నారు. 18 ఏళ్ళు నిండిన యువతీ, యువకులను నూతన ఓటరుగా నమోదు చేయడం ద్వారా వారిని ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయడమేనని వెల్లడించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశమైన మన దేశంలో ఓటు ఎంతో పవిత్రమైనదని పేర్కొన్నారు. ఓటు హక్కు వజ్రాయుధమని, తమ ఓటు హక్కుతో దేశ భవితవ్యాన్ని మార్చగల శక్తి ఓటర్లందరికీ ఉందన్నారు. అదేవిధంగా కొత్త ఓటర్ల నమోదుకై యువతలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్లు ప్రజాస్వామ్య బద్ధమైన పరిపాలన కోసం ప్రజామోద ప్రభుత్వాన్ని ఎన్నుకోవటంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. ×భారతదేశ పౌరులమైన మేము, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మనదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతాం. మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటును వినియోగించుకుంటాం॰ అని పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాస్, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీపీఓ ఏఓ యం.సులోచన, ఎస్బీ డీఎస్పీ బీమా నాయక్, ఆర్‌ఐలు శ్రీహరి రెడ్డి, సీతారామిరెడ్డి ఎస్సైలు, ఆర్ఎస్సైలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకు ఇండియన్ పోలీస్ మెడల్

- సీఐ వెంకటేశ్వర్లును అభినందించిన పీటీసీ ఎస్పీ ఏఆర్ దామోదర్



సీఐ అద్దంకి వెంకటేశ్వర్లును అభినందిస్తున్న పోలీస్ ట్రైనింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఎస్పీ ఏఆర్ దామోదర్, పోలీస్ అధికారులు

ఒంగోలు సబర్బన్: ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన సీఐ అద్దంకి వెంకటేశ్వర్లును పోలీస్ ట్రైనింగ్ కాలేజీ (పీటీసీ) ప్రిన్స్‌పాల్, ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు. స్థానిక పీటీసీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీతో పాటు పీటీసీలో పనిచేస్తున్న పోలీస్ అధికారులు వెంకటేశ్వర్లును అభినందించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో 41 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పని చేయటంతో పాటు ప్రస్తుతం ఒంగోలు పోలీస్ శిక్షణ కళాశాలలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ అద్దంకి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివన్నారు. పోలీస్ కానిస్టేబుల్‌గా జీవితాన్ని ప్రారంభించి ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారన్నారు. విశిష్ట సేవలు, క్రమశిక్షణకు, వృత్తి పట్ల అంకితభావం, పట్టుదల, సేవా దృక్పథాన్ని గుర్తించి వెంకటేశ్వర్లును ఇండియన్ పోలీస్ మెడల్‌కు సిఫార్సు చేశామన్నారు.

నడికుడి– కాళహస్తి రైల్వే లైన్ స్థల పరిశీలన

- భూ యజమానులకు మెరుగైన పరిహారం



రైల్వేలైన్ మ్యాప్ పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, పక్కన ఆర్డీవో ఇర్విన్

పొమూరు: మండలంలోని రావిగుంటపల్లె, మార్కొండాపురం, ఇనిమెర్ల గ్రామాలకు చెందిన భూముల్లో నిర్మించ తలపెట్టిన ప్రతిపాదిత నడికుడి– శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు సంబంధించిన భూముల కోసం గురువారం జేసీ శ్రీనివాసులు రావిగుంటపల్లె, మార్కొండాపురం, ఇనిమెర్ల గ్రామాల వద్ద పరిశీలించారు. రైల్వేలైన్, భూముల మ్యాప్‌ను పరిశీలించి భూ యజమానులతో మాట్లాడారు. ఇప్పటికే కొంతమంది రైతులకు పరిహారం వచ్చింది. కాగా నాడు చుక్కల భూమిగా ఉండి ప్రభుత్వ చొరవతో సాధారణ భూమిగా రికార్డుల్లో మార్పు చెందిన భూములకు పరిహారం ఇచ్చేందుకు రైతులతో చర్చించారు. రావిగుంటపల్లె గ్రామానికి సంబంధించి సుమారు 18 ఎకరాలు, ఇనిమెర్లకు సంబంధించి సుమారు 3 ఎకరాల భూమికి సంబంధించి రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. మార్కెట్ ధరలకు అనుగుణంగా మెరుగైన పరిహారం ఇప్పించాలని రైతులు కోరగా నిబంధనలకు అనుగుణంగా మెరుగైన పరిహారం మంజూరయ్యేలా చూస్తానని జేసీ రైతులకు భరోసా ఇచ్చారు. రైల్వేలైన్ పనులు పూర్తయితే ఈప్రాంతం అభివృద్ధి చెందుతుందని రైతులు, స్థానికులు అందుకు సహకరించాలని జేసీ వారికి సూచించారు. కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, పొమూరు తహసీల్దార్ ఆవుల సురేష్, ఆంజనేయులు వీఆర్‌వో షేక్.రఫి అహ్మద్, సర్వేయర్ అబ్రహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలినేనికి సత్కారం



ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మహిళా నాయకులు

ఒంగోలు: ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి పదవులు పొందిన మహిళా నాయకులు గురువారం శాసన సభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలుసుకుని సత్కరించారు. 2024 సాధారణ ఎన్నికలకు కష్టపడి పనిచేసి పార్టీ కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళి గెలుపు కోసం కృషిచేస్తామని బాలినేనికి తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర, జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, ఉపాధ్యక్షురాలు బత్తుల ప్రమీల, జల్లిపల్లి సుబ్బులు, ప్రధాన కార్యదర్శి సాదం లక్ష్మి, కార్యదర్శులు నగబోతుల నిర్మల, చీమలదిన్నె గృహలక్ష్మి, కావూరి సుశీల, సంయుక్త కార్యదర్శులు పిడుగురాళ్ల కోటేశ్వరమ్మ, షేక్ సగీనా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో ఏకేయూ వీసీ మారెడ్డి

ఒంగోలు: పర్యావరణ పరిరక్షణే విద్యార్థుల ధ్యేయం అని ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. గురువారం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో ఏకేయూ ఎన్ఎస్ఎస్ విభాగం నిర్వహించిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సమాజాభివృద్ధి కోసం విద్యార్థులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తారతమ్యం లేకుండా విరివిగా మొక్కలను నాటాలన్నారు. ఈ విధంగా చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని నింపి వారి ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాల్లో వారిని భాగస్వాములు చేయాలన్నారు. రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నివారణలో విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భాగస్వాములు కావాలన్నారు. వాతావరణంలో సమతుల్యత లేకపోవడం వల్ల పర్యావరణంలో అనేక విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో వ్యక్తిగత అవసరాలకు తప్పకుండా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల నదులు కలుషితం కాకుండా ఉంటాయని ఏకేయూ కాలేజీ ప్రిన్సిపాల్ జి.రాజమోహన్ పేర్కొన్నారు. కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతమ్‌కుమార్ దేవ్ మాట్లాడుతూ నేటి సమాజంలో గాలిలోని కలుషితాన్ని సైతం నివారించి ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించాలంటే మొక్కలను విరివిగా పెంచాలన్నారు. సోషల్ వర్క్ డిపార్టుమెంట్ సహాయక ఆచార్యులు డాక్టర్ పి.వెంకట్రావు, ఆర్.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ సయ్యద్ ఆశీఫుద్దీన్ తదితరులు మొక్కలు నాటారు.

ఎమ్మెల్యే సొంత ఖర్చుతో క్రీడాకారిణికి వైద్యం



ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో రోహిణికి వైద్య సేవలు

ఉలవపాడు: ఆడుదాం ఆంధ్ర క్రీడలు ఆడే సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురైన క్రీడాకారిణికి ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి పూర్తి వైద్యం చేయించారు. వివరాలు.. ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం కుచెందిన క్రీడాకారిణి వాయలరోహిణి బుధవారం కందుకూరులో జరుగుతున్న నియోజకవర్గ ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా గుడ్లూరుతో కబడ్డీ ఆడుతున్న సమయంలో ఫిట్స్ రావడంతో పడిపోయింది. వెంటనే అధికారులు స్థానిక వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి కందుకూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకుని వెళ్లగా సీరియస్‌గా ఉందని తెలియచేయడంతో ఎమ్మెల్యే మహీధరరెడ్డి వెంటనే స్పందించి కందుకూరు నుంచి ఒంగోలుకు అంబులెన్స్‌లో కిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులతో ఆయనే స్వయంగా మాట్లాడారు. ఎంత ఖర్చు అయినా పరవాలేదని.. జాగ్రత్తగా చూడాలని తెలిపారు. వెంటనే సిటీస్కాన్, ఎమ్మారై స్కాన్‌ను తీయించారు. కేవలం ఫిట్స్ రావడం వలన ఇలా జరిగిందని తెలియజేశారు. అవసరం అయిన పరీక్షలు, మందులు ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో భరించారు. గురువారం ఆ క్రీడాకారిణి ఆరోగ్యంగా ఉందని, డిశ్చార్జి చేస్తున్నట్లు వైద్యులు తతెలిపారు.. తనకు అత్యవసర సమయంలో వెంటనే స్పందించి వైద్యం చేయించిన ఎమ్మెల్యేకు తండ్రి ఇసాక్ కృతజ్ఞతలు తెలియచేశారు.

బాలికలే సమాజ ప్రతినిధులు

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు పద్మావతి



మాట్లాడుతున్న బాలల హక్కుల కమిటీ పరిరక్షణ సభ్యురాలు పద్మావతి

ఒంగోలు సిటీ: బాలికలే సమాజానికి ప్రతినిధులు అని వారి భవిష్యత్తు వారి చేతుల్లోనే ఉందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు పద్మావతి అన్నారు. గురువారం జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ సమాజంలో బాలికలకు బాలురుతో పాటు సమాన అవకాశాలు ఉన్నప్పటికీ పురాతన కాలం నుంచి సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు, కట్టుబాట్ల వలన బాలికలకు అవకాశాలు కోల్పోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా గత సంవత్సరం పది, ఇంటర్‌లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపించిన మొదటి ఐదు మంది విద్యార్థులకు రూ. 5000 నగదు ఇచ్చామన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. అందులో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.మాధురి, ఒంగోలు సీడీపీఓ ఫణిరాజకుమారి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జయ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రామాంజనేయులు, జిల్లా బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్ పాల్గొన్నారు.